క్లుప్తంగా

టెన్త్ ఇంటర్నల్ మార్కులు నమోదు

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల్లో 2023–24 విద్యాసంవత్సరం పదోతరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల నమోదుకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ పరీక్షల విభాగం శుక్రవారం నుంచి అనుమతి ఇచ్చినట్లు జిల్లా విద్యాశాఖ బాధ్యులు తెలిపారు. మార్కుల జాబితాను మళ్లీ సంబంధిత పర్యవేక్షణ బృందం సరిచూసిన తర్వాత జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలని వివరించారు. మార్చి 2వ తేదీ వరకు ఇంటర్నల్ మార్కుల నమోదు చేసి అందజేయాలని పరీక్షల నియంత్రణాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



వేములవాడఅర్బన్: పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివే 7వ తరగతి విద్యార్థి ఈశ్వర్ ప్రసాద్ ఈనెల 26 నుంచి 29వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగే రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు భూక్యా బన్నాజీ తెలిపారు. విద్యార్థికి జెర్సీ, బాల్ అభినందించినట్లు పేర్కొన్నారు.

వృద్ధులకు కంటి ఆపరేషన్లు

ఎల్లారెడ్డిపేట: మండలంలో కంటి జబ్బుతో బాధపడుతున్న వృద్ధులకు అశ్విని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నారు. శుక్రవాం పది మందికి కంటి ఆపరేషన్లు చేసి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేశారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అభినయ్ మాట్లాడుతూ.. వృద్ధులకు సేవ చేయాలన్న ఉద్దేశంతో కంటివైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అద్దాలు, ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

ముస్తాబాద్: మండలంలోని గూడెం మోడల్ అంగన్‌వాడీ కేంద్రాన్ని జెడ్పీటీసీ గుండం నర్సయ్య శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా పౌష్టికాహారం అందించేందుకు రాగి లడ్డూలు అందిస్తోందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శిథిలావస్థలో ఉన్న మంచినీటి ట్యాంక్‌ను పరిశీలించా రు. వెంటనే కూల్చివేసి కొత్తగా నిర్మించాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న జెడ్పీ చైర్‌పర్సన్, నాయకులు

కోనరావుపేట: మండలంలోని మల్కపేటలో పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం సారుగమ్మ బోనాలు తీశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ నాయకులు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, మాజీ సర్పంచ్ ఆరె లత, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వేములవాడఅర్బన్: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వేములవాడ ట్రాఫిక్ ఎస్సై దిలీప్ కుమార్ అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో రోడ్డు సెఫ్టీలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. పాఠశాల కరస్పాండెంట్ సన్నిది వెంకటకృష్ణ, ప్రిన్సిపాల్ కల్యాణ్ కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జాతరకు తరలిన మండలవాసులు

బోయినపల్లి: మండలంలోని పలుగ్రామాల ప్రజలు సమ్మక్క, సారలమ్మ జాతరకు వెళ్లేందుకు అటు కరీంనగర్ జిల్లా రేకుర్తి, ఇటు చింతకుంటకు శుక్రవారం తరలివెళ్లారు. అక్కడ అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వన దేవతలకు పసుపు, కుంకుమలు, బంగారం సమర్పించారు. ఈ ప్రాంతంలో జాతర ఉత్సవాలు జరిగే ప్రదేశాలు లేకపోవడంతో భక్తులు అమ్మవార్ల దర్శనానికి రేకుర్తి, చింతకుంట జాతరకు వెళ్లారు.

పంటపొలాల పరిశీలన

వీర్నపల్లి: మండలకేంద్రంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీధర్ రెడ్డి పంట పొలాలను రైతులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. నత్రజని ఎరువులు అధికంగా వాడటంతో వరిలో కాండం తొలిచే పురుగు, అగ్గి తెగులు సమస్య ఎక్కువగా వస్తుందన్నారు. వరిపంట చిరు పొట్టదశలో ఉన్నందున రైతులు యూరియాతో పాటుగా పొటాష్ వేయాలన్నారు. రైతులు శేఖర్, సంతోష్, రమేశ్, రాజు తదితరులున్నారు.

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ
- సిరిసిల్లలో సంత్ సేవాలాల్ జయంతికి హాజరు



ఆర్యవైశ్య సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్



సిరిసిల్లలో సంత్‌సేవాలాల్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ/సిరిసిల్లటౌన్: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడలోని గుడి చెరువు కట్టకింద ప్రాంతంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం భవన నిర్మాణం పనులకు శుక్రవారం భూమిపూజ చేసి మాట్లాడారు. భవన నిర్మాణానికి తన వంతుసహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, భవన నిర్మాణ కమిటీ చైర్మన్ కట్కూరి శ్రీనివాస్, కార్యదర్శి సామ వీరవెంకటరమణ, కోశాధికారి మోటూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యానికి కరాటే అవసరం

ఆత్మస్థైర్యానికి కరాటే అవసరమని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మార్చి 3న ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కరాటే పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కరాటే అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కె.వసంత్‌కుమార్, పోటీల చీఫ్ ఆర్గనైజర్ అబ్దుల్ మన్నాన్, సీనియర్ కరాటే మాస్టర్లు కూరగాయల శ్రీనివాస్, దండుగల తిరుపతి, లోలపు రాజు, మానుపాటి తిరుపతి, రాజశేఖర్‌రెడ్డి, కనికరపు రాజశేఖర్ పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు అభినందనలు

వేములవాడ కుంగ్‌ఫూ కరాటే విద్యార్థులు తమ ప్రతిభను కనబరచి బహుమతులు సాధించడం అభినందనీయమని శ్రీనివాస్ కొనియాడారు. ఈనెల 18న హైదరాబాద్‌లో జరిగిన 4వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మాస్టర్ గగ్గూరి దివ్య ఆధ్వర్యంలో పాల్గొన్న విద్యార్థులను సత్కరించారు. బ్లాక్‌బెల్ట్‌లో విగ్నేష్, అర్జున్‌లు స్వర్ణం, ప్రసన్య రజతం, పిట్టల లత కాంస్యం సాధించారు. కౌన్సిలర్ బింగి మహేశ్, కరాటే మాస్టర్లు శ్రీనివాస్, ప్రసాద్, సురేష్, విష్ణు, శ్రావణి, లాస్యలత, తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జీవితం ఆదర్శనీయం

సంతు సేవాలాల్ జీవితం ఆదర్శనీయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సిరిసిల్లలో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. సేవాలాల్ గిరిజనుల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. గిరిజనుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గిరిజనులకు పోడు భూముల పట్టాల విషయంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు భూక్యా రెడ్యానాయక్, లింగంపల్లి సత్యనారాయణ, బంజారా సేవాలాల్ సంఘ్ ప్రతినిధులు సురేష్, గోపి, తిరుపతి, రాజు, గజన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరు

రుద్రంగి(వేములవాడ): మండలకేంద్రానికి చెందిన అక్కెనపెల్లి నర్సయ్య, జమున కుమారుడి వివాహ వేడుకకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఆయనవెంట డీసీసీ కార్యదర్శి తర్రె లింగం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, నాయకులు బైరి గంగ మల్లయ్య, రమేశ్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలకేంద్రానికి చెందిన కాదాసు ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆది శ్రీనివాస్ పరామర్శించారు. మాజీసర్పంచ్ తర్రె ప్రభలత, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శి త ర్రె లింగం, నాయకులు శ్రీనివాస్, తదితరులున్నారు.

ఈ విజయం మంకు రాజయ్యకు అంకితం



కప్‌ను అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట: టీపీఎల్(టీచర్స్ ప్రీమియర్‌లీగ్)–3 విజయాన్ని దివంగత ఎంఈవో మంకు రాజయ్యకు అంకితం ఇస్తున్నట్లు ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కప్‌ను ఎల్లారెడ్డిపేట ఎమ్మార్సీలో ఉంచనున్నట్లు తెలిపారు. మంకు రాజయ్య స్ఫూర్తితో రానున్న రోజుల్లో అన్ని అంశాల్లో మండలాన్ని ముందు వరుసలో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్, మైదంశెట్టి మల్లికార్జున్, సుమన్, మారుపాక రాజు, అక్బర్, యశ్‌పాల్, తిరుపతి, సంజీవ్, గంగయ్య, లక్ష్మణ్, మధు, సుధీర్, బాలకృష్ణారెడ్డి, రమేశ్, ప్రశాంత్, మహేందర్, కృష్ణ పాల్గొన్నారు.

నేటినుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



ముస్తాబైన భక్తాంజనేయస్వామి ఆలయం

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఈనెల 24 నుంచి 26వరకు భక్తాంజనేయస్వామి విగ్రహ స్థిరప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ భక్తబృందం సభ్యులు శుక్రవారం తెలిపారు. ఈనెల 24న గోపూజ, ప్రతిష్ఠ దేవతా విగ్రహాల గ్రామ ఊరేగింపు, 25న సామూహిక హవనములు, దేవతా విగ్రహాలకు ఫల, పుష్ప, 26న భక్తాంజనేయస్వామి స్థిర విగ్రహప్రతిష్ఠ, పూర్ణాహుతి ఉంటుందన్నారు. సంకెపల్లి చంద్రమౌళి శర్మ, రత్నాకర్ శర్మ, వెంకన్నశర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ పూజలు జరుగుతాయన్నారు.

ఘనంగా ఉమామహేశ్వరుల కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ముస్తాబాద్: మండలంలోని మద్దికుంటలోని పురాతన శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గోధ అంజిబాబు, భాగ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రఘురామశర్మ ఆధ్వర్యంలో శ్రీ ఉమా మహేశ్వర కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులకు ఎంపీపీ శరత్‌రావు అన్నప్రసాదం అందించారు. దుర్గామాత, ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు గోపాల్‌రావు, మాజీ సర్పంచ్‌లు భాగ్యశ్రీ, రామశర్మ, నాయకులు అనిల్, స్వామిగౌడ్, తిరుపతి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కోనరావుపేట: గోరుముద్ద కార్యక్రమాన్ని పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని దాతలు కోరారు. కొలనూర్ ఉన్నత పాఠశాలలో మాజీసర్పంచ్ అబ్దుల్ రషీద్, నారాయణ, ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, ఒరుగంటి శంకర్, వీరబోయిన తిరుపతి సహకారంతో పాఠశాలలో గోరుముద్ద కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పది విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ దేవేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచులకు సన్మానం

చందుర్తి : మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మాజీ సర్పంచులను కేడీసీసీ డైరెక్టర్, సనుగుల సింగిల్ విండో అధ్యక్షుడు జలగం కిషన్‌రావు ఆధ్వర్యంలో సన్మానించారు. ఎంపీపీ లావణ్య, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు అశోక్, మండల రైతు సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య సన్మానించి మెమెంటోలు అందజేశారు. లింగంపేట ఎంపీటీసీ సభ్యులు పెగ్గర్ల రమేశ్‌రావు, నాయకులు రమేశ్, గోపాల్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

‘కస్తూర్బా’లో సమస్యల తిష్ట

- డైనింగ్‌హాల్ లేక ఇరుకు గది, వరండాలోనే భోజనాలు
- అసంపూర్తిగా అదనపు స్నానపు గదుల నిర్మాణాలు
- బాలికలకు భద్రత కరువు



డైనింగ్ హాల్ లేక ఇరుకు గదిలో భోజనం చేస్తున్న బాలికలు

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంకేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సమస్యలు తిష్టవేస్తున్నాయి. పాఠశాలలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 330 మంది బాలికలు చదువుతున్నారు. బాలికా విద్యను ప్రోత్సహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేజీబీవీలను ఏర్పాటు చేశాయి. కానీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమవుతున్నారు.

డైనింగ్ హాల్‌లేక..

కేజీబీవీలో డైనింగ్‌హాల్ లేక 330 మంది విద్యార్థినులు ఇరుకు గదిలో, తరగతి గది, వరండాలో భోజనాలు చేస్తున్నారు. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భోజనం కోసం బాలికలు క్యూలో నిరీక్షించాల్సి వస్తోంది.

330 మందికి ఎనిమిది స్నానపు గదులే

బాలికలు స్నానాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 330 మంది బాలికలకు కేవలం ఎనిమిది స్నానపుగదులు మాత్రమే ఉన్నాయి. దీంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. మరో ఎనిమిది అదనపు స్నానపు గదులు నిర్మించనున్నారు. పిల్లర్లు పోసి అసంపూర్తిగా వదిలేశారు. నిర్మాణం పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వరండాలోనే నిద్ర..

కేజీబీవీలో అడ్మిషన్లు పెంచాలనే ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు సిబ్బంది ఎంతో కృషిచేశారు. 360 సీట్లకు గాను 330 మంది పాఠశాలలో ప్రస్తుతం చదువుతున్నారు. పెరిగిన విద్యార్థులకనుగుణంగా పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపర్చడం లేదు. ఫలితంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇక్కట్లు పడుతున్నారు. డార్మిటరీలో సరిపడా గదులు లేక బాలికలు తరగతి గదులు, ల్యాబ్‌లు, వరండాలో నిద్రించాల్సి వస్తోంది. పాఠశాల నిర్వహణ గదులు కూడా డార్మెంటరీకే కేటాయించారు.

బాలికలకు కరువైన భద్రత

పాఠశాలలో బాలికలకు భద్రత కరువైంది. విద్యాలయ ప్రహరీ ఎత్తు రోడ్డుకు సమానంగా ఉండడంతో సులభంగా ఎవరైనా ప్రహరీ దూకే అవకాశం ఉంది. గోడ ఎత్తు పెంచి గ్రిల్స్ ఏర్పాటు చేస్తే భద్రత ఉంటుందని బాలికల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భావిస్తున్నారు. రెండో అంతస్తుపై గేటు కూడా లేదు.

స్నానపు గదులు నిర్మించాలి



పాఠశాలలో 330 మంది చదువుతున్నారు ఎనిమిది స్నానపు గదులు మాత్రమే ఉన్నాయి. మరో ఎనిమిది గదులు నిర్మిస్తామని పనులు చేపట్టి వదిలేశారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– దీపిక, ఎనిమిదో తరగతి విద్యార్థిని

డైనింగ్‌హాల్ ఏర్పాటు చేయాలి



పాఠశాలలో డైనింగ్ హాల్ లేక భోజన సమయంలో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు డైనింగ్‌హాల్ ఏర్పాటు చేయాలి. రోజూ కింద కూర్చొని భోజనం చేయాల్సి వస్తోంది. వెంటనే డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలి

– సౌమ్య, ఇంటర్ విద్యార్థిని

ఉన్నతాధికారులకు తెలిపాం



స్కూల్‌లో సమస్యలు, అత్యవసర పనుల గురించి ఉన్నతాధికారులకు తెలిపాం. ప్రహరీ ఎత్తుపెంచడం, గ్రిల్స్ ఏర్పాటు, డైనింగ్ హాల్, బాత్‌రూమ్స్, డార్మెంటరీకి అదనపు గదుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. – వసంత, కేజీబీవీ ప్రత్యేకాధికారి, గంభీరావుపేట

పంట పొలాలకు నీటిని విడుదల చేయాలి



వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం ఉద్యోగులు

చందుర్తి : పంటలు ఎండిపోకుండా ఎల్లంపల్లి నీరు విడుదల చేయాలని కోరుతూ మండల రైతు సంఘం అధ్యక్షుడు చిలుక పెంటయ్య ఆధ్వర్యంలో మాజీ సర్పంచులు తహసీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఐదురోజుల క్రితం ఎల్లంపల్లి నీరు విడుదల చేసి నిలిపివేశారన్నారు. పంటలు చేతికొచ్చే దశలో ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ డైరెక్టర్ జలగం కిషన్‌రావు, సర్పంచులు దుమ్ము అంజయ్య, చిలుక అంజిబాబు, మ్యాకల పర్శరాములు, ఆయిల్నేని కమలాకర్‌రావు, రాపెల్లి గంగాధర్, లింగంపేట ఎంపీటీసీ సభ్యులు పెగ్గర్ల రమేశ్‌రావు, రుద్రంగి మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు దప్పుల అశోక్, డైరెక్టర్ నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలుగా బాలాలయంలోనే పూజలు

- రూ.30 లక్షల కంట్రిబ్యూషన్ చెల్లిస్తే రూ.కోటి ఇస్తామన్న టీటీడీ



వేణుగోపాలస్వామి ఆలయం

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శ్రీరుక్మిణి సత్యభామసమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని రూ.3కోట్లతో పునర్ నిర్మించేందుకు గత జూన్‌లో పనులు మొదలుపెట్టారు. అప్పటి వరకు ప్రధాన ఆలయంలో పూజలు అందుకున్న స్వామి వారిని సమీపంలో నిర్మించిన బాలాలయంలోకి తరలించారు. అప్పటి నుంచి వేణుగోపాలస్వామి బాలాలయంలోనే పూజలు అందుకుంటున్నారు. ఏడు నెలలుగా ఆలయ నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. రూ.30 లక్షలు కాంట్రిబ్యూషన్‌గా చెల్లిస్తే తిరుమల తిరుపతి దేవస్థానం వారు రూ.3కోట్లు మంజూరు చేయనున్నట్లు తెలిసింది. ఈ కాంట్రిబ్యూషన్ డబ్బులు చెల్లించడంలో జాప్యమవుతోంది. రూ.30లక్షలు కాంట్రిబ్యూషన్ కోసం మాజీ మంత్రి కేటీఆర్ ఇస్తానని అన్నారని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నంది కిషన్ పేర్కొంటున్నారు. కాంట్రిబ్యూషన్ డబ్బుల విషయంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో చర్చించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్ పేర్కొంటున్నారు. ఏది ఏమైనా త్వరగా ఆలయ ప నులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముస్తాబవుతున్న సత్రం

- నేటి నుంచి మూడు రోజులు యాగాలు



ముస్తాబవుతున్న వాసవీ నిత్యాన్నదాన సత్రం

వేములవాడ: వేములవాడలో అతిపెద్ద కల్యాణమండపంగా పేరొందిన వాసవీ నిత్యాన్నదానసత్రం పునర్‌ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది. ఉమ్మడి రాష్ట్రంలోనే అతిపెద్ద హాల్‌గా పేరొచ్చిన ఈ కల్యాణ మండపాన్ని ఆర్యవైశ్యులు తిరిగి మరమ్మతులు చేశారు. దీంతో భారతీ తీర్థ మహాస్వామి విధుశేఖర భారతస్వామి, వాసవీ మహాపీఠాధీశ్వరులు శ్రీధర్ స్వామిజీ, రాధాకృష్ణ సిద్ధాంతిల ఆధ్వర్యంలో శనివారం నుంచి మూడు రోజులపాటు యాగాలు, హోమాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు బుస్స శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్, కోశాధికారి కట్కం కిషన్, రెనోవేషన్ కమిటీ చైర్మన్ నగుబోతు రవీందర్ తెలిపారు.

విధులకు అంగన్‌వాడీ టీచర్ డుమ్మా..

- విధుల్లో ఆయా నిర్లక్ష్యం

చందుర్తి: చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ ఆటపాటలతో పాటు విద్యాబుద్ధులు చెప్పేందుకు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు అధ్వానంగా మారిందనడానికి మండలకేంద్రంలోని మొదటి అంగన్‌వాడీ కేంద్రమే ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఈ సెంటర్‌లో 25మంది చిన్నారులు ఉన్నారు. అంగన్‌వాడీ టీచర్ భూజ్యోతి శుక్రవారం విధులకు గైర్హాజరైంది. ఆయా పద్మ చి న్నారులను వదిలేసి మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రంలోనే గాఢ నిద్రలో మునిగింది. అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించేందుకు ఏర్పాటు చేసిన సూపర్‌వైజర్ సమావేశాలకు తప్ప మిగతా సమయాల్లో పర్యవేక్షణ చేపట్టకపోవడంతోనే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు విధులు సక్రమంగా చేపట్టడం లేదన్న విమర్శలున్నాయి. ఈ విషయమై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శంకరమ్మను వివరణ కోరగా చిన్నారుల ఆధార్ నెంబర్లు నమోదు చేయడానికి అంగన్‌వాడీ టీచర్ వేములవాడ ఐసీడీఎస్ కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

• ఆలయంలో దొంగతనం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్లగొల్లపల్లి కన్యాకపరమేశ్వరి వాసవి మాత ఆలయంలో చోరీ జరిగింది. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం..ఆలయ పూజారి గురువారం రాత్రి ఆలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం చూసేసరికి ఆలయం తాళాలు పగులకొట్టి ఉన్నాయి. ఆలయంలో హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఆలయ పుజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

• వృద్ధురాలి ఆత్మహత్య

రుద్రంగి(వేములవాడ): అనారోగ్యంతో ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దెగావత్ తండా గ్రామానికి చెందిన కున్సోత్ ముత్యాలి (70) అనే వృద్ధురాలు అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కొడుకు కున్సోత్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

• కాలువకు మరమ్మతులు

రుద్రంగి: వేసవిదృష్ట్యా పంటపొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కాలువకు మరమ్మతులు చేపట్టి పంటపొలాలకు ఎల్లంపెల్లి ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించగా శుక్రవారం నాగారం చెరువులకు గోదావరి జలాలు వెళ్లే కాలువకు మరమ్మతు పనులు చేపట్టారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, రైతులు ఉన్నారు.

• వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం కుంకుమపూజ, హోమం, కల్యాణమూర్తి పల్లకీసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ వేడుకలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, బైరగోని నందుగౌడ్, చేపూరి గంగాధర్, లక్ష్మారెడ్డి, బైరగోని శ్రీనివాస్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ చీటి రామారావు, నాయకులు పాల్గొన్నారు.

• లాస్య నందిత మృతిపట్ల నివాళి

సిరిసిల్లటౌన్: కారు ప్రమాదంలో మృతిచెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితకు బీఆర్‌ఎస్ నాయకులు నివాళి అర్పించారు. తెలంగాణ భవన్‌లో లాస్య నందిత మృతికి సంతాపం ప్రకటించారు. ఆమె మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటుగా వక్తలు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన రవి, నాయకులు కుంభాల మల్లారెడ్డి, ఎండీ సత్తార్, రాజారాం, నారాయణరావు, ఎల్లయ్య, రాజిరెడ్డి, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బాధాకరమని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. జెడ్పీటీసీ కార్యాలయంలో నందిత మృతిపై నివాళి అర్పించారు. ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు సుభాశ్, నర్సింలు, నర్సింహారెడ్డి, సుధాకర్, కిషన్, రాజం, సతీశ్ రెడ్డి, సీత్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత

ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌కు చెందిన పంతంగి మల్లవ్వ–భాస్కర్ కూతురు లావణ్య వివాహానికి సామాజిక కార్యకర్త నేవూరి వెంకట్‌రెడ్డి శుక్రవారం పుస్తెమెట్టెలు అందజేశారు. నాయకులు తిరుపతి, పర్శరాంరెడ్డి, భాస్కర్, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.